www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025

5

తూర్పుగోదావరి



సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ కార్యక్రమం ఏప్రియల్ 21న సోమవారం యథావిధిగా కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రం, మున్సిపల్, కార్పొరేషన్స్ పరిధిలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్నాహ్న 1.00 గంటల వరకు ప్రజల నుంచి పిజిఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేకాధికారులు, జిల్లా, డివిజన్ మండల, మున్సిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 21న మధ్యాహ్నం 3 గంటలకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన జిల్లా జిల్లా సమీక్షా కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.

విచ్చలవిడిగా ఫార్మసీలు


- అర్హత లేని సిబ్బందితో నిర్వహణ
- డాక్టర్ల చీటీ లేకున్నా మందుల విక్రయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. ఇటీవల ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టి కొరడా ఝుళిపించిన విషయం విదితమే. అయితే కొద్ది రోజులకే నిర్వాహకులు యథాతథంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. అనుమతి లేకుండా ఫార్మసీలు నిర్వహిస్తూ ప్రజల నుంచి అందినకాడికి దోచుకుంటోంది. అనుమతి ఉన్న మెడికల్ షాపుల్లో అర్హత లేని సిబ్బందిని నియమించి కొనసాగిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా సుమారు 940 మెడికల్ షాపులు ఉన్నట్టు సమాచారం. అనధికారికంగా మరో 100కి పైగా షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం షాపుల్లో ఒక నెలకు రూ.కోటికి పైగా విలువైన మందుల విక్రయాలు సాగుతున్నాయి. అత్యధిక వ్యాపారం రాజమహేంద్రవరంలో జరుగుతోంది. చుట్టు పక్కల మండలాల నుంచి వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఆస్పత్రులను ఆశ్రయించడం పరిపాటి. వైద్యుల సూచన అనంతరం మందులు ఇక్కడే కొనుగోలు చేసి వెళుతుంటారు. అనుమతి లేకుండా షాపులు నిర్వహిస్తూ విక్రయించిన మందులకు సైతం బిల్లులు ఇవ్వకుండా ప్రజల జేబులకు చిల్లువేస్తున్నారు. కొన్నిచోట్ల డాక్టర్ల చీటీ లేకుండానే మందులు అమ్ముతున్నారు.

అనధికార షాపులపై చర్యలేవీ..?

జిల్లావ్యాప్తంగా సుమారు 940 మెడికల్ షాపులకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు చాలా తేడాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1,040 వరకూ మెడికల్ షాపులు ఉన్నట్టు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరంలోనే 500 రిటైల్ షాపులు, 200 హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. చాలా మెడికల్ షాపుల్లో అర్హత గల సిబ్బంది లేరనేది బహిరంగ రహస్యమే. ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన అర్హత గల వారి పేర్లపై షాపులకు అనుమతి తీసుకొని అర్హతలేని సిబ్బంది ద్వారా మందులను ప్రజలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారిక షాపులలో సైతం చాలా వరకు అర్హత లేని సిబ్బందే మందులు విక్రయిస్తున్నారు. ప్రధాన మెడిసిన్స్‌కు సంబంధించి సిబ్బందికి ప్రజలకు ఎలా విక్రయించాలో ముందే చెబుతున్నారు. దీంతో ప్రజలు ఆ మందులు వేసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు.



అత్యధిక విక్రయాలు డాక్టర్ల మందుల చీటి లేకుండానే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం డాక్టర్ రాసి ఇచ్చిన మందుల చీటీ (మెడిసిన్ ప్రిస్కిప్షన్) ఆధారంగానే మందులను వినియోగదారులకు విక్రయించాల్సి ఉంటుంది. కానీ, జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల్లో ఇష్టారీతిన మందుల విక్రయం జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్లు రాసిన మందులను ఇవ్వాల్సింది పోయి తమకు తోచిన మందులను రోగులకు ఇస్తూ వారి జీవితాలతో కొందరు షాపుల నిర్వాహకులు ఆడుకుంటున్నారు. విక్రయించిన ప్రతి డ్రగ్‌కు బిల్లు ఇవ్వాల్సి ఉండగా లేకుండానే అమ్మేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు మందులు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బిపి, సుగర్ వంటి వ్యాధులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు మందులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. డ్రగ్ కంట్రోలర్ అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి అనధికార వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ విధానంలో ఆసీలు వసూలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ మార్కె ట్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే చెక్ పోస్ట్ వద్ద ఈ పోస్ యంత్రాలను ఏర్పాటు చేసి ఆసీలు వసూళ్లు పూర్తి స్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎస్‌బిఐ సేల్స్ ఎక్జిక్యూటివ్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడారు. ఇందుకోసం అన్ని చెక్ పోస్ట్‌ల వద్దా తగిన సంఖ్యలో ఆయా ఈ పోస్ పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 12 ఎఎంసి చెక్ పోస్టుల వద్ద సెస్ వసూళ్లను నగదు రూపంలో కాక డిజిటల్ పేమెంట్ ప్రక్రియను చేపట్టి ఒకేసారి ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ఈ తరహాలో తొలిసారిగా మన జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రప్రథమంగా ప్రారంభించి, వీటి ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఆర్థికపరమైన లావాదేవీల్లో అక్రమాలకు అవకాశం లేకుండా ఈమేరకు ప్రతిపాదనలు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపరు. డిజిటల్ నగదు చెల్లింపులను నేరుగా ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తామని, అందువల్ల టోల్ గేట్ వద్ద ఆర్థిక అక్రమాలకి చెక్ పెట్టడం సాధ్యం అవుతుందని తెలిపారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని బిక్కవోలు చెక్ పోస్ట్ వద్ద, రాజమండ్రి పరిధిలోని కాతేరు, కొవ్వూరు, సీతంపేట చెక్ పోస్ట్‌లు, గోపాలపురం పరిధిలో యర్నగూడెం, గోపాలపురం, నల్లజర్ల చెక్ పోస్ట్‌లు, నిడదవోలు పరిధిలోని పెరవలి, నిడదవోలు చెక్ పోస్ట్‌ల వద్ద, రాజానగరం ఎఎంసికి చెందిన రాజానగరం, సీతానగరం, కోరుకొండ చెక్ పోస్ట్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రైతులు పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లేటప్పుడు, సరుకు రవాణా ఆధారంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు డిజిటల్ సేవల విధానంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న మూడు నాలుగు రోజుల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

శ్మశాన వాటికకు 3 ఎకరాలు కేటాయించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మున్సిపల్ దళిత క్రైస్తవ శ్మశాన వాటికకు అదనంగా 3 ఎకరాలు కేటాయించాలని శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ శ్మశానం దశాబ్దాలుగా పూర్వీకుల సమాధులతో నిండిపోయి ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సమాధుల్లో స్థలం సరిపడక చనిపోయిన వారిని ఖననం చెయ్యడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జనాభా పెరుగుతున్న దృష్ట్యా అదనంగా స్థలం కేటాయించాలని కోరారు. శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం, వాటర్ ట్యాంక్ నిర్మాణం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, యు.మోషే, గుమ్మడి రమేష్, అశోక్, రాజేష్, టి.నానీ తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటికలో ధర్నా చేస్తున్న రాంబాబు, నాయకులు

జెఇఇ మెయిన్స్‌లో తిరుమల జయభేరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ మెయిన్స్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్టు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ 2వ ర్యాంకు, కె.యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకు, వి.శరత్ సంతోష్ 9వ ర్యాంకు, వి.తేజశ్రీ 18వ ర్యాంకు, టి.జశ్వంత్ దొర 30వ ర్యాంకు, కె.అభినవ్ 45వ ర్యాంకు, కె.యశ్వంత్ రాజా 46వ ర్యాంకు, జి.సుజోష్ రాజా 66వ ర్యాంకు, ఇ.వర్షిత్ 75వ ర్యాంకు, ఎం.కారుణ్య రాజ్ 86వ ర్యాంకు, కె.వెంకట రామ వినీష్ 100వ ర్యాంకు, జి.కార్తీక్ 120వ ర్యాంకు, వి.రామసాయి వరుణ్ 163వ ర్యాంకు, జి.చేతన్ నాగ అనిరుధ్ 164వ ర్యాంకు, కె.శంకర్ మాణిక్ 191వ ర్యాంకు, ఎం.సిరి సంజన 204వ ర్యాంకు, పి.జశ్వంత్ సాయి చరణ్ 219వ ర్యాంకు, ఎం.విశ్వనాథ నాగసాయి రామ్ 224వ ర్యాంకు, డి.ఆశిష్ సాయి శ్రీకర్ 235వ ర్యాంకు, కె.సాయి సృజన 236వ ర్యాంకు, సిహెచ్.శ్రీచరణ్ 242వ ర్యాంకు, వై.దేవేష్ రుత్విక్ 246వ ర్యాంకు, పి.ప్రణవ్ రుద్రీష్ 247 ర్యాంకు సాధించడంతో పాటు 292, 310, 313, 319, 326, 331, 338, 349, 366, 391, 395, 403, 429, 444, 465, 473. ర్యాంకులు సాధించారని 1000 లోపు 58 మంది 5000 లోపు 254 మంది, 10,000 లోపు 417 మంది, 20,000 లోపు 654 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులలో 1,620 మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత పొంది 93 శాతం సక్సెస్ రేటు సాధించారని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు,

బుర్రిలంకలోఅగ్నిప్రమాదం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని బుర్రిలంకలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో స్థానికంగా నివాసముంటున్న పంతాల కొండారత్నం, మండెల త్రివేణికి చెందిన ఇల్లు అగ్నికి ఆహుతయ్యింది. సర్పంచ్ పాటంశెట్టి రామ్‌జీ సకాలంలో స్పందించి ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా అప్రమత్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా స్థానికులు వివరించారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని రెవెన్యూ అధికారులకు వివరించారు. సర్పంచ్ తనవంతు సాయంగా రూ.పది వేలు బాధితులకు అందించారు. నూనె ప్రభు రూ.5000 సాయం అందించారు. పంచాయతీ సభ్యులు బోడపాటి రాజేశ్వరి, నరమామిడి సుబ్రహ్మణ్యం, కట్టా శివ, గట్టి సూరిబాబు, పట్టా బాలు, వారా నాగేష్ ఉన్నారు.

నేడు ఆస్తిపన్ను కౌంటర్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల చెల్లింపులకు ఆదివారం కూడా ప్రత్యేక కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకూ బకాయిలు 30వ తేదీలోగా పన్నులపై ఉన్న వడ్డీ 50 శాతం, 2025-26 ఆర్థిక సంవత్సరం యొక్క పన్ను ఏకమొత్తముగా చెల్లించినవారికి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినందున చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థలోని ట్రెజరీ, అదనపు కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని తెలిపారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ వైపు పయనించాలి

జిల్లావ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశాన్ని అందిపుచ్చుకొని స్వచ్ఛాంధ్రప్రదేశ్ వైపు పయనిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యం అవుతుందన్న ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఇ-వేస్ట్) సేకరించి వాటిని సురక్షిత పద్ధతుల్లో రీ సైకిల్ చేయడంపై దృష్టి సారించామని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్‌ను విడుదల చేసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కేతనగార్గ్, పాల్గొన్నారు. మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎలఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బొమ్మూరులోని వైటిసి ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో డిపిఒ వి.శాంతా మణి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి 'స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛంద స్ఫూర్తితో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, కలెక్టరేట్ ఎఒ ఆలీ, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్థానిక కోటగుమ్మం వద్ద జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎడిలు వెంకట్రాజు, ఛాయాదేవి, సూపరింటెండెంట్ రాజకుమారి, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, విజయ్, రాజు, జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలంలోని కాల్దారిలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధన ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఉప సర్పంచ్ ఏర్పిన సత్యనారాయణ, తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.ఆంజనేయ శర్మ, పాల్గొన్నారు.

చాగల్లు పరిధిలో అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. చాగల్లులో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఆలీ తెలిపారు, గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి పాల్గొన్నారు.

కడియం జేగురుపాడు గ్రామ పంచాయతీ వద్ద ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసు ప్రజలు చేత స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఫిషర్‌మెన్ సొసైటీ ప్రెసిడెంట్ శాఖ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లపూడిలో గ్రామ కార్యదర్శి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వీరన్న, సచివాలయ కార్యదర్శి శ్రీను, అన్నదేవరపేటలో సర్పంచ్ సుధారాణి, కార్యదర్శి శ్రీనివాస్, గజ్జరంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, మలకపల్లిలో సర్పంచ్ రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి, నూర్జహాన్, పెద్దేవంలో ఉప సర్పంచ్ తోట రామకృష్ణ. కార్యదర్శి సాంబమూర్తి, వేగేశ్వరపురంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు భారతి, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కార్యదర్శి నాగాంజనేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి మార్కెటింగ్, ఎం. సునీల్ వినయ్, ఎల్ డి ఎమ్ డివి ప్రసాద్, ఎస్బిఐ జోనల్ సేల్స్ మేనేజర్ ఎన్.రాజేశ్ పాల్గొన్నారు.

గోపాలపురం మండల ప్రత్యేకాధికారి టి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ బిఎస్.శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి వి.అనురాధ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బంగారయ్య, ఎఒ వి.రాజారావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్




ఉండ్రాజవరంలో మొక్క నాటుతున్న మంత్రి కందుల దుర్గేష్, నాయకులు



కడియంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది

కార్టూన్'నిజం'



ఢిల్లీలో మూడ్రోజులుంటే జబ్బు ఖాయం: గడ్కరీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెంకట్రాజు

గ్రామాల అభివృద్ధికి కలిసి పని చేయాలి

ప్రజాశక్తి-గోపాలపురం

గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడారు. పలు గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఉన్న పలు శాఖల అధికారులను పిలిచి వారు చేస్తున్న పనులు, వారికి కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పథకాలను, వారు చేస్తున్న అభివృద్ధి పనులను వెల్లడించారు. కొవ్వూరుపాడు సర్పంచ్ మాట్లాడుతూ కొవ్వూరుపాడులో తాగునీటి ట్యాంకు శిథిలావస్థలో ఉందని దానిని తొలగించి కొత్త ట్యాంకును ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖ అధికారులు సహకరించడం లేదంటూ పలువురు వైసిపికి చెందిన సర్పంచులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు, గ్రామాల అభివద్ధికి ఎంఎల్‌ఎ సహకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ వెంకట్రాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులు సమన్వయంగా కలిసి పని చేయాలనిన్నారు. ఆ సమయంలోనే ఆ శాఖకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉంటే గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు చెప్పమనడం అధికారుల ద్వారా ఆ సమస్యను పరిష్కరించాలన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా గోపి

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కడియపులంకకు చెందిన పార్టీ సీనియర్ నేత, ప్రముఖ నర్సరీ రైతు బోడపాటి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ విషయాన్ని చైర్మన్ మార్ని వాసుదేవ్ తనకు తెలియజేశారని గోపాలకృష్ణ తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నర్సరీ రైతుగా రైతుల సమస్యల పట్ల తనకు అవగాహన ఉందని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నల్లజర్ల

విజయవాడ హెల్స్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ సహకారంతో శ్రీ సంఘమిత్ర విద్యాలయ దూబచర్లలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగడం, ఎడమ చేయి లాగడం, ఎక్కువ కాలంగా ఉన్న బిపి, సుగర్ వల్ల వచ్చే గుండె జబ్బులకు ఎంతో ఖరీదైన గుండె స్కానింగ్, ఇసిజి, ఎకో పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. అవసరమైన వారికి రూ.12,500 విలువైన యాంజియోగ్రాం టెస్ట్ ఉచితంగా చేస్తారని తెలిపారు.

పోషక విలువల ఆహారాన్ని తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పోషణ్ పట్వాడాలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేస్తున్న బాల సంజీవని వంటి పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలు తప్పనిసరిగా స్వీకరించాలని తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉండ్రాజవరం వెలుగు కార్యాలయంలో అంగన్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పట్వాడా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిడిపిఒ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే కిట్ల ఉపయోగం, వాటిలో ఉండే పోషక విలువల గురించి తెలిపారు. అన్ని పోషకాలూ ఉండే ఆహార పదార్థాలు, అంగన్‌వాడీలో పంపిణీ చేసే గుడ్లు, పాలు, తల్లులు తీసుకోవాలని చెప్పారు. హెచ్ఎస్‌లు పోషకాల గురించి వివరించారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-రాజానగరం

మూడు నెలలుగా ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట్ నాయుడు మాట్లాడారు. కేంద్ర ఉపాధి హామీ పథకం నిధులను పక్కకు మళ్లిస్తున్నారన్నారు. వేతనాలతోపాటు కూలీలకు గునపాలు, పార, మజ్జిగ తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. దీనిలో చిరుకూరు నాగమ్మ, షేక్ ఆదాంబీ, అబ్బులు, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చదలాడ గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తడాల కొండరాజులు(51) మృతి చెందారని పోలీసులు తెలిపారు. చదలాడ గ్రామానికి చెందిన కొండరాజులు శనివారం ఉదయం చేలో పనిచేసేందుకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా అదే సమయంలో తిరుపతి గ్రామం నుంచి ఉలిమేశ్వరం వెడుతున్న వరి కోతలు కోసే ట్రాలీ ట్రాక్టర్ కొండరాజులును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.మౌనిక పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని శృంగవరం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వికె.రాయపురం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జరిపిన దాడులలో గ్రామానికి చెందిన అజంగి వీరభద్రరావు సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎక్సైజ్ సిఐ కె.రామ్మోహనరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎంవివి.కుమార్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైసిపి శ్రేణులతో మాట్లాడుతున్న గిరిబాబు

అధికారంలోకి రావడమే లక్ష్యం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శనివారం మండలంలోని చింతలూరు, శరభవరం, ఏలేశ్వరం మండలంలోని అప్పనపాలెం, తిరుమాలి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో పథకాలు, కూటమి పాలనలో వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - కరప

రైతులు రసాయనికి వ్యవసాయాన్ని వదిలి, ప్రకృతి వ్యవసాయం సాగించడం ద్వారా లాభాలు అధికంగా పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని పెద్దాపురప్పాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అందుకు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం విఆర్ఒ డి.భరణికుమార్, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు, వ్యవసాయ సహాయకులు, విఎఎలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎడిఎఫ్ఒ ఎం.శ్రీహరిజగన్నాథ్ ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్‌సి వద్ద సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలకు చెందిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎల్‌ఎఫ్‌లు పిఆర్ఆర్.ప్రసాద్, వై.వీరబాబు, ఎఫ్‌ఎంలు కె.మురళీకృష్ణ, ఎండి యాకూబ్, ఎం.సురేష్, జి.చిరంజీవి పాల్గొన్నారు.



యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ మోహన్‌కుమార్

కెమెరాలతో చోరీల నియంత్రణ

ప్రజాశక్తి - కాజులూరు

కెమెరాల ఏర్పాటుతో చోరీలను నియంత్రించ వచ్చని ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని సలపాక గ్రామంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆయా యువజన సంఘాలు, పెద్దలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు.

పాలకుల తీరు... ప్రజలు బేజారు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలోని కూటమి పాలకుల తీరుపై ప్రజలను ఆందోళన కల్గిస్తుంది. వక్ఫ్ సవరణ బిల్లుకు గత వారంలో పార్లమెంటులో ఆమోదం లభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ముస్లిం సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలను జిల్లాలోనూ ఈ వారం కొనసాగాయి. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలతో పాటు నిరసన ర్యాలీలతో ఆందోళనలు మిన్నంటాయి. జిల్లా కేంద్రాలైన రాజమహేంద్రవరం, కాకినాడ పట్టణాలలో చేపట్టిన నిరసన ర్యాలీలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, యువత పాల్గొని తమ మద్దతు తెలిపారు. తాజా నిర్ణయంతో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలపై జరుగుతున్న దాడులు మరోసారి చర్చనీయాంశం అయ్యాయి. ప్రజల మధ్య ఐక్యత మధ్య చిచ్చుపెట్టే ఇటువంటి నిర్ణయాలను కూటమిలో భాగస్వామ పార్టీలైన టిడిపి, జనసేన పార్టీలు సైతం వ్యతిరేకించకపోవటం కలవరానికి గురిచేస్తోంది. గత వారంలో పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతి నేపథ్యంలో క్రైస్తవ సంఘాలు ఆందోళన బాట పట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పోలీసులు విచారణ పూర్తి చేసి ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారంటూ తేల్చిచెప్పారు. అయితే ఇప్పటికీ పాస్టర్ మృతిపై క్రైస్తవ సంఘాలలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టిడిపి ప్రభుత్వం సమగ్ర విచారణ జరపలేదనే అభిప్రాయం నెలకొంది. వరుస ఘటనల నేపథ్యంలో టిడిపి, జనసేన పార్టీలలో ముస్లిం, క్రైస్తవ నాయకులు, కార్యకర్తలలోనూ ఆలోచన మొదలైంది. భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఆయా వర్గాలకు జవాబుదారీగా ఉండటంతో పాటు ప్రజల ఐక్యత పరిరక్షించేందుకు కృషి చేయాల్సి ఉంది.

'కందుకూరి'కి దక్కని చోటు

సంఘ సంస్కర్త, విద్యావేత్త కందుకూరి వీరేశలింగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం సాహితీవేత్తలతో పాటు సామాన్యులను సైతం కలవరానికి గురి చేస్తోంది. కవులకు, కళాకారులకు పుట్టినిల్లైన రాజమహేంద్రవరం సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచింది. ఈ ప్రాంతం నుంచి కందుకూరి వీరేశలింగం తన యావదాస్తిని ప్రజల కోసం ధారపోశారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థలలో నేటికీ లక్షలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సమాజ పురోభివృద్ధి కోసం ఆనాటి మూఢాచారాలపై సంస్కరణోద్యమ ఖడ్గధారిగా పేరుగాంచారు. అటువంటి వీరేశలింగం పంతులు పట్ల టిడిపి అనుసరిస్తున్నతీరు విమర్శలకు దారి తీస్తోంది. రాజమహేంద్రవరం వద్ద కోటిపల్లి బస్టాండ్ సర్కిల్‌లో గతంలో కందుకూరి విగ్రహాన్ని తొలగించి మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. దీంతో కవులు, కళాకారులు ఆందోళనలకు దిగటంతో అదే బస్టాండ్‌లో ఓ వైపు నిర్మించి అప్పటి టిడిపి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ప్రముఖుల జయంతులు, వర్ధంతుల కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో కందుకూరిని విస్మరించటం విమర్శలకు దారితీసింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలని, జిల్లా నుంచి సారథ్యం వహిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ ఆ దిశగా ప్రయత్నం చేయాలని కవులు, కళాకారులు, రచయితలు, అభ్యుదయ వాదులు కోరుతున్నారు.

అగ్గి రగిలితే బుగ్గే

ఓ వైపు మండుతున్న ఎండలు మరో వైపు అగ్ని ప్రమాదాలు జిల్లా ప్రజలను కలవరానికి గురి చేస్తున్నాయి. గత వారం ప్రారంభంలో అనకాపల్లిలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం గురించి తెలిసిందే. ఈ ఘటనలో అక్కడికక్కడే పలువురు చనిపోగా, మరి కొందరు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ఘటన మరవక ముందే జిల్లాలోని చాగల్లు మండలం ఐ పంగిడిలో బాణాసంచా గోదాములో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవటంతో ప్రజలతో పాటు అధికార యంత్రాంగమూ ఉలిక్కిపడింది. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాణా సంచా తయారీ కేంద్రాలలో అమలు చేస్తున్న అగ్ని ప్రమాద నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అదే విధంగా అగ్ని మాపక శాఖలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చొరవ చూపించాలి. యంత్ర పరికరాలు అందుబాటులోకి తెచ్చి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టడంతో పాటు అగ్నిమాపక వారోత్సవాలలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి.

గంగపుత్రుల గోస

వేటనిషేధ నేపథ్యంలో ప్రభుత్వ భరోసా కోసం గంగ పుత్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. చేపల పునరుత్పత్తి కాలం నేపథ్యంలో సుమారు 60 రోజుల పాటు చేపల వేట నిషేధం గత కొన్నేళ్ల నుంచి అమలవుతున్న విషయం విదితమే. అయితే వేటపై ఆధారపడి జీవించే కుటుంబాల కోసం నిర్దేశించిన పోరాటాల నేపథ్యంలో ఎట్టకేలకు గత ప్రభుత్వాలు దిగొచ్చి బియ్యం, పప్పులు, ఇతర వంట సరుకులను అందించేవి. కాల క్రమంలో సరుకుల బదులుగా నగదు అందజేయటం ప్రారంభించిన పాలక ప్రభుత్వాలు క్రమేపీ కుటుంబాలకు భరోసాను దూరం చేస్తున్నాయి. గత ప్రభుత్వం రూ.10,000 భృతి అంటూ ప్రకటించి కొద్ది మందికి నగదు అందజేసి అర్హులకు సైతం మొండి చేయిచూపించింది. తాజాగా కూటమి ప్రభుత్వం రూ.20,000 ఇస్తామంటూ అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకూ ఎన్యుమరేషన్ ప్రక్రియకు సైతం శ్రీకారం చుట్టలేదు. ఈ నేపథ్యంలో భృతిపై నీలినీడలు కమ్ముకున్నాయా..? అనే సందేహం గంగ పుత్రులలో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సకాలంలో భరోసా అందించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - తుని

మండలంలోని డి.పోలవరంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ యనమల దివ్య పాల్గొని ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తియిన సందర్భంగా ప్రజలతో ముఖాముఖీగా మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భూమి సరిహద్దు సమస్యలు 11, ఉపాధి కూలీ డబ్బులు చెల్లించడంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై పలువురు ఆమెకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఆయా శాఖ అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను



వినతలను స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ యనమల దివ్య

అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సంబంధిత నివేదికను అధికారులు అందజేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ కోటనందూరు, తుని, తుని రూరల్, తొండంగి మండలాల్లో ప్రజా దర్బార్‌ను నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు యనమల రాజేష్, సిహెచ్.అబ్బాయి, ఎం.వెంకటేష్, ఎ.నర్సింహమూర్తి, పి.సోమేశ్వరరావు, రామకృష్ణ, పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ఆదిత్య ప్రభంజనం

ప్రజాశక్తి - కాకినాడ

జెఇఇ-25 ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులతోనే ఆదిత్య జాతీయ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించింది. ఆలిండియాలో కె.రుత్విక్ 23వ ర్యాంకు సాధించగా, ఆలిండియాలో 46వ ర్యాంకును పి.ఆదిత్య అభిషేక్ సాధించినట్లు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా స్థాయిలో 109, 111, 112, 118, 135, 144, 155, 206, 212, 280, 300, 309, 342, 359క, 395, 524 వంటి వివిధ కేటగిరీల నుంచి తమ సంస్థ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారని అన్నారు. ఈ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం ప్రతినిధులు

సందర్భంగా ర్యాంకులను సాధించిన విద్యార్థులతోపాటు, అందుకు కృషి చేసిన అధ్యాపకులను వారు అభినందించారు.

వాడివేడిగా గ్రామ సభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం పంచాయతీలో సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామసభ వాడీవేడీగా సాగింది. ఈ సందర్భంగా పలు విషయాలపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు. సర్వే నెంబర్ 125లోని భూమి తనదంటూ సర్పంచ్ ఆ భూమిని మార్కెట్‌కు దానం చేసినట్లు ప్రకటిస్తున్నారని, ఆ భూమి ఎవరిదో తేల్చాలని స్థానికులు గుత్తుల నాగేశ్వరరావు, మోపూరి రెడ్డినాయుడు, రవికుమార్ ప్రశ్నించారు. పంచాయతీలో 10 మంది సిబ్బంది జీతాలు తీసుకుంటున్నారని, అయితే వారంతా విధులకు హాజరుకావడం లేదని పలువురు సభ దృష్టికి తెచ్చారు. ఎన్‌టిఆర్ సృజల స్రవంతి పథకంలో వసూలు చేసిన మొత్తానికి జమ ఖర్చులు తెలపాలని కోరారు. నగదు పుస్తకం తన వద్ద లేదని కార్యదర్శి తెలపడంతో స్థానికులు గ్రామ సభను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనిపై ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి విజెవి.రమణ స్థానికులను శాంతింప చేశారు. ప్రజలు లేవనెత్తిన పలు అంశాలకు ఆయన వివరణ ఇచ్చారు. ఈ సభలో ఎంపిటిసి గుత్తుల శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, పలివెల రవి, నాగాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసెస్ ర్యాలీ

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట పట్టణంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టి. బ్లెస్సింగ్ అధ్యక్షతన రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కె.జయబాబు, ట్రెజరర్ వై.కరుణకుమార్, ఉపాధ్యక్షులు పి.తిమోతి, సంఘీయులు వి.జాన్, పి.ఆనంద్‌బాబు, ఎంఎ.జేమ్స్ పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణంలో రన్ పర్ జీసస్ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని లూథరన్ హైస్కూల్ వద్ద కో-ఆర్డినేటర్ డాక్టర్ లంక పురుషోత్తమ దాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, డాక్టర్ జాన్ పలివెల, డి.వెంకట్‌పాల్, జె.జోసెఫ్‌కుమార్, జి.చందుస్టీఫెన్, ఎ.



శంఖవరంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

జాన్‌బాబు పాల్గొన్నారు. **శంఖవరం** మండలంలోని కత్తిపూడిలో రన్ పర్ జీసెస్ ర్యాలీ జరిగింది. స్థానిక చర్చి వద్ద క్రైస్తవ పెద్దలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎస్.మధు.బాబు న్యాయవాది రాయి శ్రీను బ్రదర్ సో గుడ్ మోహన్ డాక్టర్ ఆనంద్ సతీష్ హరీష్ కత్తిపూడి మాజీ సర్పంచ్ సల్మాన్ సంఘ విశ్వాసులు చిల్డ్రన్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి బాల,బాలికల బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5-30 గంటల నుంచి 8.30 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ శిక్షణతో పాటు పౌష్టికాహారం అందజేస్తామన్నారు. శిక్షణలో పాల్గొనే వారి వయస్సు 8 సంవత్సరాల పైబడి ఉండాలని అన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రులు ఫోన్ నెంబర్లు తీసుకురావాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు.

వేట నిషేధ పరిహారం అందించాలి

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారులందరికీ వేట నిషేధ పరిహారం అందించాలని సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 15 వరకు వేట నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి వేట నిషేధ పరిహారానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 18వ తేదీన ఒక్కరోజు మాత్రమే అవకాశం ఇచ్చిందన్నారు. చాలామంది దరఖాస్తు చేసుకోవడానికి మిగిలిపోయి ఉన్నారని, కావున గడువును పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. 2 నెలలపాటు మత్స్యకారులు వేటకు వెళ్లకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టతరం అవుతుందని, అటువంటి పరిస్థితుల్లో వేట నిషేధ పరిహారం వారికి కొంత ఊరటనిస్తుందని అన్నారు. వేట నిషేధ పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచకపోతే మత్స్యకారులందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

ఉచిత సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కరప

ప్రయివేట్ పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ బి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు లాటరీ పద్ధతిలో కేటాయించేలా షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్ ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకూ అవకాశం ఉందన్నారు.

ప్రయోగాలపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జగన్నాథపురం మల్లాడి సత్యలింగం నాయకర్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల గత 4 రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా శనివారం సైన్స్ ప్రయోగాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ పాఠ్యపుస్తక రచయిత, సైన్స్ ప్రమోటర్ రాయపాటి శివ నాగేశ్వరరావు 28 సైన్స్ ప్రయోగాలు చేసి, వివరించి, విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని తెలిపారు. ఎంఎస్ఎన్ చారిటీస్ కార్యనిర్వహణాధికారి, సహాయక కమిషనర్, కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం పై విద్యార్థులలో ఆసక్తి పెంపొందించేందుకు, ప్రయోగాత్మక విజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు సైన్స్ ప్రయోగాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బాల వేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, సిసిఆర్‌టి రిసోర్స్‌పర్సన్ కెవిఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.2.91 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతిలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2,91,596 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,05,,730, అన్నదాన విరాళాల ద్వారా రూ.58,801, కేశఖండన ద్వారా రూ.7,040, తులాభారం ద్వారా రూ.750, లడ్డు ప్రసాదం ద్వారా రూ.19,275 వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. తుని మండలం రాజుపేటకు చెందిన దాతలు అల్లు రామకృష్ణ, అరుణ వల్లభ స్వామికి 2.690 గ్రాముల వెండిని సమర్పించారనిఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు తీర్థప్రసాదాలను అందించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి

లాడ్జీల్లో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని పలు లాడ్జీలను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డిఎస్‌పి డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ మురళీమోహన్ శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించే తనిఖీల్లో గంజాయి తరలింపు, వేశ్యవృత్తి, మత్తు పదార్థాల వినియోగం వంటి కార్యకలాపాలు జరగకుండా ఉండే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు డిఎస్‌పి తెలిపారు. లాడ్జిలో దిగిన వారి వివరాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనుమానితుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామానికి చెందిన సూరంపూడి సూరిబాబుకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కును ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు శనివారం అందజేశారు. సూరిబాబు అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. సిఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆయనకు మంజూరైన రూ.3.58,900 చెక్కును శనివారం అందించారు.